
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 19 ఏప్రిల్ 2023





ఈద్గా మైదానం పరిశీలన

తిరుపతి టౌన్ : త్వరలో ముస్లీం సోదరులు రంజాన్ పండుగ జరుపుకోనున్న సందర్భంగా తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష మంగళవారం ఎస్వీయూ రహదారిలోని ఈద్గా మైదానాన్ని ముస్లీం నాయకులతో కలిసి పరిశీలించారు. వేసవి కావున పందిళ్లు వేయించి, కూలర్లు, ఫ్యాన్లు, తాగునీటి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటి సభ్యులు ఎస్‌కె బాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఖాదర్‌బాషా, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఇమ్రాన్, తిరుపతి ఖాజీ సయ్యద్ షఫీ మహ్మద్ ఖాద్రి పాల్గొన్నారు.

కళ్లాంలో ధాన్యం...

కళ్లల్లో దైన్యం..!



నెల్లూరు మసూర కొనేవారు లేక...పది రోజులుగా రోడ్డుపైనే రైతులు

ప్రజాశక్తి - బాలాయపల్లి

ఎండనక వాననక ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. పంట పండించే ముందు ధరల భారంతో కుంగిపోయే రైతన్న, చేతికందిన పంట కొనే దిక్కులేక రోడ్డుపైనే రాత్రుల్లో ధాన్యానికి కాపలా ఉంటూ దయనీయ స్థితిలో ఉన్నాడు. తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలంలో ఈ పరిస్థితి నెలకొని ఉంది. పది రోజులుగా రోడ్లపైనే ధాన్యం పోసి రైతులు ఎవరైనా కొంటారా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే ఆర్‌బికె అధికారులు అటువైపు తొంగికూడా చూడకపోవడం గమనార్హం.

అలంకారప్రాయంగా కొనుగోలు కేంద్రాలు

బాలాయపల్లి మండలంలో రబీ సీజన్‌లో నెల్లూరు మసూర వంద ఎకరాల్లో సాగు చేశారు. రేయింబవళ్లు తేడా లేకుండా కాయకష్టం చేసి పండించిన పంట అమ్ముకోలేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ధాన్యం చేతికంది 15 రోజులు కావస్తోంది. వరి నూర్పిడ్లు ఇప్పటికే పూర్తి చేశారు. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో మండుటెండల్లో ఎక్కడ అకాల వర్షం కురుస్తుందోనన్న భయం అన్నదాతను కుంగదీస్తోంది. కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన అధికారుల నుంచి స్పందన కరువవడంతో దళారులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. నెల్లూరు మసూర ఎవరూ కొనరని కావాలంటే 50 కేజీల బస్తాను 1120 నుంచి 1130 రూపాయలకు కొనుగోలు చేస్తామని, ఇష్టం ఉంటే అమ్మండి లేదంటే లేదని దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా రైతులు పండించిన పంటను వ్యవసాయ అధికారులు కొనుగోలు చేసి కష్టాల్లో ఉండే అన్నదాతను ఆదుకోవాలని కోరుతున్నారు.

కొనేవారు లేరు : గురవయ్య, మన్నూరు, బాలాయపల్లి




నెల్లూరు మసూర వడ్లు కోనేవారు రావడం లేదు. ప్రభుత్వమేమో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం. వడ్డీలు కట్టక తప్పడం లేదు. పంట అమ్మడైతే కష్టం తగ్గుతుందని చూస్తుంటే అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. ఒకవేళ వర్షం వచ్చిందంటే వడ్లన్నీ వర్షానికి సమర్పించాల్సిందే.

10 రోజులగా రోడ్డుపైనే

జడపల్లి కోటి, మన్నూరు, బాలాయపల్లి



ఆరుగాలం కష్టించి పండించాం. పది రోజులుగా ధాన్యం రోడ్లపైనే పోసి పట్టలు కప్పి ఉంచాం. ఎవరైనా అధికారి వచ్చి కొంటారేమోనని వంతుల వారీగా ధాన్యానికి కాపలా ఉంటున్నాం.. అర్ధరాత్రి ఏమరుపాటుగా ఏమైనా వర్షం వచ్చిందంటే ధాన్యం మొత్తం తడిచిపోతుంది. వేసవికాలంలో అకాల వర్షాలు వస్తాయి. అధికారులు స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేసి మా బాధలు తీర్చాలి. లేదంటే వడ్డీలు కట్టుకుంటూ ఉండాల్సిందే.



కరెంట్ కోతలతో విద్యుత్ వైర్లు సరిదిద్దేందుకు పైకి ఎక్కి...

విద్యుత్ షాక్‌తో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి -పెళ్లకూరు

పెళ్లకూరు మండలంలోని పునబాక గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీ నందు మంగళవారం తుమ్మ తొట్టి సుధాకర్ (35) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. కరెంటు లేదని కాలనీలో కొంతమంది స్తంభం ఎక్కి లైన్ బిగించమని అడగ్గా, అతను కరెంట్ పోల్ ఎక్కి కరెంట్ షాక్ తగలడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి ఇద్దరు భార్యలు. కుటుంబ కలహాలతో విడిపోవడంతో తన తండ్రి వద్దే ఉండి జీవనం సాగిస్తున్నాడు. స్థానికల సమాచారంతో విషయం తెలుసుకున్న పెళ్లకూరు ఎస్సై సిహెచ్. కష్ణారెడ్డి సంఘటనా స్థలం చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.



దేశచరిత్ర వక్రీకరణ కుట్రలో ఎన్సిఈఆర్టి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

కోవిడ్ పేరుతో పాఠ్యంశాలను హేతుబద్ధికరణ పేరుతో ఎంతో చారిత్రక మైనటువంటి దేశ చరిత్ర ను కేవలం మత పరమైన, పౌరుల సామాజిక స్వేచ్ఛ ను హరించి వేసే విధంగా పాఠ్యాంశాలులో మార్పులు చేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ ఆర్చ్ గేట్ ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి మాట్లాడుతూ హేతుబద్ధీకరణ పేరుతో స్వాతంత్ర సమరయోధులు మహాత్మా గాంధీ గురించి పాక్షికంగా, భగత్ సింగ్ జీవిత చరిత్ర ను తొలిగించి అత్యంత దుర్మార్గంగా స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ వారి తొత్తులుగా వ్యవహరించిన వారి గురించి పాఠ్య పుస్తకాలలో చేరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, లౌకిక విధానం, భిన్నత్వంలో ఏకత్వం లాంటి అంశాలను తొలగించి జ్యోతిష్యం లాంటి మూఢనమ్మకాలను ప్రోత్సహించే విధంగా మార్పులు చేశారని పేర్కొన్నారు. గణితం సబ్జక్ట్స్ లో యూక్లిడ్ డివిజన్ లేమ్మా (రెండు అంకెల గసబా ను కనుక్కోవడం,), వేక్టర్ అల్జిబ్రా(సదిశా బీజగణితం), జీవశాస్త్రం లో రి ప్రొడక్టివ్ (ప్రత్యుత్పత్తి వ్యవస్థ) ను పాఠ్యాంశాలను తొలిగించి విద్యార్థులను కాషాయికరణ విద్యా విధానాలను ఎన్ సి ఈ ఆర్ టి ద్వారా ఆర్ఎస్ఎస్ చేర్పిస్తున్నదని తెలిపారు. ఈ దురాగతాలను అడ్డుకునేందుకు దేశ వ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి ఐక్య పోరాటాలను ఎస్ఎఫ్ఐ చేపట్టబోతున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అక్బర్ , ఉరుకుందు, జిల్లా గర్ల్ కన్వీనర్ హరిత, యూనివర్సిటీ గర్ల్స్ కన్వీనర్ డింపుల్, యూనివర్సిటీ నాయకులు పద్వి, ప్రవీణ్, వేమన, రామాంజి, వెంకీ, నవీన్ పాల్గొన్నారు.

'హరిజనవాడ'ల పేరు గ్రామసభల్లో మార్పు

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఇంకా పలు ప్రాంతాల్లో హరిజనవాడలు ఉన్నాయని, వాటి పేరు మార్పుకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటి సభ్యులు కోరగా, కలెక్టర్ స్పందిస్తూ డిపిఒ వారు గ్రామాల్లో గ్రామసభలో తీర్మానం చేసి పంపాలని, గెజిట్ వెలువడిన తరువాత పేరు మార్పు జరుగుతుందని తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి వారి సమస్యలను పరిష్కరించి న్యాయం చేయడానికి ఎల్లవేళలా కృషి చేస్తుందని, ఏదైనా సమస్య ఉంటే సకాలంలో తెలిపితే సత్వరం చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన మానిటరింగ్ సమావేశం జరిగింది. ఎంఎల్‌సి బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి, డిఆర్ఓ శ్రీనివాసరావు, ఆర్డీవోలు కనక నరసారెడ్డి, కిరణ్‌కుమార్, రామారావు, చంద్రమునీరనాల్, కమిటీ కన్వీనర్ చెన్నయ్య పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023 మార్చి నాటికి జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన కేసులు 85 నమోదయ్యాయని, ఎఫ్‌ఐఆర్, ఛార్జిషీట్ అయిన బాధితులకు మానిటరీ రిలీఫ్ ద్వారా రూ. 82.50 లక్షలు నిర్దేశించిన సమయానికి చెల్లించామన్నారు. గత త్రైమాసికంలో డిసెంబర్ ఆఖరి వరకూ 21 కేసులు నమోదు కాగా, జనవరి 23 నుంచి మార్చి 23 వరకూ 25 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నా కేసుల ట్రయల్ చిత్తూరు జిల్లాలోని కోర్టులో జడ్జి పరిధిలో ఉందని, దీనికి రెగ్యులర్ జడ్జి లేకపోవడం వల్ల ముద్దాయిలకు చట్టపరంగా శిక్షలు పడటంలో జాప్యం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి జయపాల్, జిల్లా మేనేజర్ సివిల్ సప్లైస్ సుమతి, శ్రీనివాస నాయక్, సభ్యులు ప్రసాద్‌బాబు, వెంకటరమణ, మహేష్, సురేష్‌బాబు, ఎన్‌జీవో ఒఎంబర్లు రోప్ సంస్థ మునిచంద్రారెడ్డి, ప్రగతి వెంకటరమణ, ఎబిఎంఎం వెంకటాచలం పాల్గొన్నారు.



'రవీంద్ర భారతి'లో చిన్నారులకు 'డాక్టరేట్'

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

చదువుతోపాటు విజ్ఞానం పెంపొందించుకోవాలని , చిన్నారులు సెల్‌ఫోన్ మోజులో చదువుపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని టిటిడి దేవస్థానం అన్నమాచార్యప్రాజేక్టు మాజీ డైరక్టర్ మేడసాని మోహన్ తెలిపారు. మంగళవారం కొర్లగుంట రవీంద్ర భారతి హైస్కూల్ నందు యుకెజి నుంచి 5 వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఘనంగా కాన్వికేషన్‌డే నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా మేడసాని మోహన్, విశ్వం విద్యా సంస్థల, అధినేత డా,ఎన్ విశ్వనాథరెడ్డి, ప్రముఖ మెజిషియన్ విజయ కుమార్, రవీంద్ర భారతి స్కూల్ కరస్పాండెంట్ రవీంద్ర నాద రెడ్డి పాల్గొన్నారు.

బియ్యం కొనుగోలులో పాతవిధానమే మేలు : టిటిడి ఈవో

ప్రజాశక్తి - తిరుమల



తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్న ప్రసాదాలు అందించడానికి మిల్లర్ల నుంచి నేరుగా బియ్యం కొనుగోలు చేయాలని ఆలోచిస్తున్నట్లు టీటీడీ ఈవో ఎ వి ధర్మారెడ్డి చెప్పారు. తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి గహంలో మంగళవారం ఈవో, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ, టీటీడీ అన్నప్రసాదాలకు, ఇతర అవసరాలకు 2013 నుండి 2019వ సంవత్సరం వరకు తెలుగు రాష్ట్రాల్లోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నుండి నాణ్యమైన సోనా మసూర బియ్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2019 లో ధర్మకర్తల మండలి నిర్ణయం మేరకు టెండర్ ద్వారా బియ్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారన్నారు. టెండర్ ప్రక్రియ ద్వారా బియ్యం కొనుగోలు చేయడం వల్ల వ్యాపారస్తులు, మిల్లర్ల వద్ద కొని టీటీడీకి సరఫరా చేస్తున్నారన్నారు. టీటీడీ నేరుగా రైస్ మిల్లర్ల వద్ద కొనుగోలు చేయడం వలన మరింత నాణ్యమైన బియ్యం అందుతాయని ఆయన చెప్పారు. సమావేశంలో పాల్గొన్న మిల్లర్లు వారం రోజుల్లో బియ్యం సరఫరా రేటు తెలియజేస్తామని చెప్పినట్లు తెలిపారు. ఇటీవల టీటీడీ అన్నప్రసాదంలో బియ్యం బాగోలేదని భక్తుల నుండి ఫిర్యాదులు అందాయన్నారు. ప్రస్తుతం టెండర్ ద్వారా వ్యాపారస్తులు రూ. 38 రూపాయలకు కేజి బియ్యం అందిస్తున్నారని ఈవో వివరించారు. గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు రైతు సాధికార సంస్థ, ఏపి మార్క్ ఫెడ్లతో ఒప్పందం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జేఈవో సదా భార్గవి, డిప్యూటీ ఈవోలు సెల్వం, పద్మావతి, జిఎం (కొనుగోలు) సుబ్రహ్మణ్యం జి ఎం ప్రొక్యూర్మెంట్, అన్న ప్రసాదం ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన గంగమ్మ ఆలయ పనులు

తిరుపతి టౌన్ : యుద్ధప్రాతిపదికన తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పనులు జరుగుతున్నాయని ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆలయ పనులను, రోడ్డు విస్తరణ పనులను మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి పరిశీలించారు. మే ఒకటికల్లా ఆలయ పనులు పూర్తి చేసుకుని ఐదో తేదీ మహాకుంభాభిషేకం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ మోహన్, ఎంఇ చంద్రశేఖర్, ఎంహెచ్ఒ హరికృష్ణ, ఎసిపిలు గుణశేఖర్, షణ్ముగం, గంగమ్మగుడి ఛైర్మన్ గోపియాదవ్ పాల్గొన్నారు.



వరదయ్యపాలెంలో..

బిజెపిని సాగనంపుదాం ...దేశాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

'బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం' అంటూ వక్తలు ఉద్ఘాటించారు. 'మోడీ హటావో.. దేశ్ కో బచావో' అనే నినాదంతో ఈనెల 14 నుండి 30వ తేదీ వరకు సిపిఐ సిపిఎం తలపెట్టిన ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం వరదయ్యపాలెం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బహిరంగసభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వం లోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ కంపెనీలకు తొత్తులుగా వ్యవహరిస్తోందన్నారు. దేశ సంపదను ఆదాని అంబానీలకు కారు చౌకగా అమ్ముతోందని, ప్రభుత్వం నడుపుతున్న విమానయానం ,వాడరేవులు, రైల్వే ,ఎల్ఐసి , క్రీడా మైదానాలు, బొగ్గు గనులు ఉక్కు పరిశ్రమలు ప్రైవేట్ పరం చేసి కార్పొరేట్ కంపెనీ యజమానులకు ధారాదత్తం చేసిన మోడీ దేశ ద్రోహి అని అన్నారు. పెట్రోల్ డీజిల్, నిత్యవసర వస్తువుల, గ్యాస్ ధరలు ప్రజలకు పెను భారంగా మారాయన్నారు. సిపిఎం ప్రభుత్వం ఉన్న కేరళలో అన్ని మతాలకు సమాన హక్కులు కల్పిస్తూ స్వేచ్ఛ వాతావరణంలో ప్రజలను పాలిస్తోందన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి జనార్ధన్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్ని రాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి,సిపిఎం మండల కార్యదర్శి రమేష్, నాగరాజు, రమణయ్య, సుబ్బయ్య ,తిరుపాల్, తరుణ్ , చంద్ర శేఖర్, సిద్దలయ్య పాల్గొన్నారు

'ప్రచారభేరి' సభలో వామపక్షాల ఉద్ఘాటన

21న తిరుపతిలో వామపక్షాల బహిరంగసభ

తిరుపతి టౌన్ : ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్న మోడీ పాలనను సాగనంపేందుకు వామపక్షాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమం జరుగుతోందని, ఇందులో భాగంగా ఈనెల 21న తిరుపతి పాత కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బహిరంగసభ ఉంటుందని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.నాగరాజు, పి.మురళి తెలిపారు. ప్రచారభేరిలో భాగంగా మంగళవారం ఐదో రోజు పాదయాత్ర కొర్లగుంట ప్రాంతంలో సాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం, కె.రాధాక్రిష్ణ, చిన్నం పెంచలయ్య, మాధవ్, బుజ్జి, వేణు, మునిరాజా, ఎన్‌డి శ్రీను, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

గూడూరులో.. మంగళవారం వంకినగుంట నుంచి ఎగువవీరారెడ్డిపల్లి వరకూ ప్రచారభేరి యాత్ర సాగింది. సిపిఎం నాయకులు జోగి శివకుమార్, పామంజి మణి, బి.చంద్రయ్య, బివి రమణయ్య పాల్గొన్నారు. **బిఎన్ కండ్రిగలో..** సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కత్తిరవి, ఆంబాకం చిన్నిరాజ్ ఆధ్వర్యంలో బిఎన్ కండ్రిగ ప్రధాన రహదారిలో ప్రచారం నిర్వహించారు. నాయకులు ఎం.రమేష్, ఎం.నాగరాజు, ఎం.ధనంజయులు, ఎం.రమణయ్య, బాలగురవయ్య పాల్గొన్నారు. **శ్రీకాళహస్తిలో** సిపిఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో సాగింది.

ప్రాజెక్టు ప్రారంభమై 13ఏళ్లు

'నడికుడి'...తడబడి..!

రూ.7వేల కోట్లు దాటిన బడ్జెట్ వ్యయం

మెట్ట మండలాల ప్రజల ఆశలు ఆవిరి

నత్తను తలపిస్తున్న 'శ్రీకాళహస్తి' రైల్వేలైన్ పనులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని పశ్చిమ మెట్ట మండలాల ప్రజల ఆకాంక్షల శ్రీకాళహస్తి- నడికుడి రైలు మార్గం ఎడమయ్యే ప్రమాదంలో పడింది. ప్రాజెక్టు ప్రారంభమై దాదాపు 13 ఏళ్లు దాటిపోతున్నా అతీగతీ లేని పరిస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన భాగస్వామ్యంతో నిర్మించ తలపెట్టిన ఈ రైలు మార్గం గత ప్రభుత్వాల పాలనలో నిర్లక్ష్యానికి గురైంది. 2010-11 బడ్జెట్‌లో రూ. 2,450 కోట్ల వ్యయంతో అప్పటి కేంద్రం పచ్చజెండా ఊపింది. 2016 వరకు పనుల్లో పురోగతి లేదు. ఫలితంగా 2020కి పూర్తి కావాలసిన ప్రాజెక్టు పనులు ఇంకా సాగుతూనే ఉన్నాయి. తాజాగా ప్రాజెక్టు వ్యయం రూ. 7 వేల కోట్లకు చేరుకోగా 2023-24 బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం కేవలం రూ. 202 కోట్లు ముష్టి రాల్చడంపై నిపుణులు మండిపడుతున్నారు.


మొదటి దశకే ముచ్చెమటలు

నడికుడి- శ్రీకాళహస్తి రైలు మార్గం మొత్తం నాలుగు దశల్లో పూర్తి కావాల్సి ఉంది. మొదటి దశ పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం వరకు 46 కి.మీ, రెండో దశ గుండ్లకమ్మ, దరిశి, ఆత్మకూరు, వెంకటగిరి వరకు 126.16 కి.మీ, మూడో దశ కనిగిరి నుంచి ఆత్మకూరు వరకు 95.55 కి.మీ, నాల్గో దశ వెంకటగిరి నుంచి శ్రీకాళహస్తి వరకు 41 కి.మీ. మొదటి దశగా గుంటూరు జిల్లాలో పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం వరకు 46 కి.మీ రైల్వేలైను పూర్తి చేసి ట్రయల్ నిర్వహించి మొదటి దశ పనులు పూర్తి చేశారు. ఇక్కడ ప్రస్తుతం విద్యుదీకరణ పనులు జరుగుతున్నాయి. సింగల్ డీజిల్ రైలు బండి నడుస్తోంది. అయితే మొదటి దశకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ముచ్చెమటలు పట్టాయి. ఇక తక్కిన నాలుగు దశలు పూర్తయ్యేందుకు ఇంకెన్నేళ్లు పట్టేనో మరి.

రైల్వే లైను నిర్మాణ స్వరూపం

ఉమ్మడి గుంటూరు జిల్లా నడికుడి నుంచి చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి వరకు వయా ప్రకాశం, నెల్లూరు మీదుగా 308.76 కి.మీ నిడివి గల ఈ మార్గంలో తొలుత 33 స్టేషన్లు నిర్మించాలని ప్రతిపాదించారు. తాజాగా ఇటీవల మరో నాలుగు కొత్త స్టేషన్ల నిర్మాణానికి రైల్వేశాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో మొత్తంగా 37 రైల్వేస్టేషన్లు నిర్మిస్తారు. ఈ నాలుగు జిల్లాల్లో 23 మెట్ట మండలాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందుకు అవసరమైన 5,189 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి రైల్వేశాఖకు అప్పగించనుంది. ఇప్పటికే గుంటూరు జిల్లాలో 800 ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 1,900 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 2,200 భూసేకరణ చేసింది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కూడా అందజేసింది. నెల్లూరు జిల్లాలో భూసేకరణ జరిగినా ఇంత వరకు నష్టపరిహారం అందించకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఈ ప్రక్రియను పూర్తయితే కానీ జిల్లాలో రైల్వేలైను నిర్మాణం జరిగే పరిస్థితి లేదు.





ప్రధాన మార్గాలకు ప్రత్యామ్నాయంగా..

న్యూఢిల్లీ- చెన్నై, హౌరా- చెన్నై ప్రధాన మార్గాలకు ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిన శ్రీకాళహస్తి-నడికుడి రైల్వేలైను కొత్త ఆంధ్రప్రదేశ్ అభివద్ధికి ఎంతగానో దోహదపడనుంది. గుంటూరు జిల్లా నుంచి చిత్తూరు జిల్లా వరకు నిర్మిస్తున్న ఈ మార్గంలో రవాణా సౌకర్యాలు ఎంతగానో మెరుగు పడనున్నాయి. హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, బెంగళూరు, కష్ణపట్నం, ఓబుళాపురం రైల్వే మార్గాలతో అనుసంధానం ఏర్పడనుంది. ఈ రైల్వేలైను పూర్తయితే హైదరాబాద్-చెన్నై, హౌరా- చెన్నై మధ్య రైళ్ల రద్దీ తగ్గే అవకాశముంది. హైదరాబాద్-చెన్నై మధ్య సుమారు 90 కి.మీ దూరం తగ్గనుంది. వరదలు, ప్రకతి విపత్తులు సంభవించిన పరిస్థితుల్లో కోస్తా తీరంలో ప్రస్తుతం వెళ్తున్న హైదరాబాద్-చెన్నై రైల్వే మార్గానికి ప్రత్యామ్నాయంగా ఈ మార్గం ఉపయోగించుకునే అవకాశముంది. గుంటూరు జిల్లాలో వెనుకబడిన పల్నాడు ప్రాంతం, ప్రకాశం జిల్లాలో పొదిలి, కనిగిరి, పామూరు ప్రాంతం, నెల్లూరు జిల్లాలోని వరికుంటపాడు, ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు, రాపూరు, వెంకటగిరి మెట్ట ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది.

వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతోమేలు

ఈ రైల్వేలైను పూర్తయితే వెనుకబడిన మెట్ట ప్రాంతాలుగా ఉన్న గుంటూరు జిల్లా పల్నాడు, ప్రకాశం జిల్లా పొదిలి, కనిగిరి, పామూరు, నెల్లూరు జిల్లా ఉదయగిరి, ఆత్మకూరు, వెంకటగిరి ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయి. రైతులు పండించే వాణిజ్య పంటలు, ఇతర ఉద్యాన పంటలు, పొగాకు, గ్రానైట్ రైల్వే మార్గం ద్వారా నేరుగా పెద్ద పెద్ద నగరాలకు ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుంది. కొత్త రైలు మార్గం ఏర్పడడం ద్వారా ఆయా ప్రాంతాలు అభివద్ధి జరిగే అవకాశాలున్నాయి.

రామకృష్ణాపురంలో అభివృద్ధి పనులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో తాగునీటి మోటారు పనిచేయకపోవడంతో సర్పంచ్ విరిత, వైసీపీ నాయకులు దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల నిధులతో నూతన మోటారును, పైపులను ఏర్పాటు చేయించారు. గ్రామస్థులకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా వెంటనే మరమ్మతులు చేయించి నీటిని సరఫరా చేశారు. అలాగే గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి సర్పంచి సొంత నిధులతో కొత్త ఫ్యాన్లను అంగన్వాడీ టీచర్‌కు అందించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యం చర్యల్లో భాగంగా మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునినరేష్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనుదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు ప్లేట్ల వితరణ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని వరదనగర్‌లోని అంగన్వాడీ పాఠశాలలో పట్టణానికి చెందిన ఉదయభాస్కర్ దాతత్వంతో చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు, తినుబండారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటామన్నారు. కార్యక్రమంలో చంద్రనిల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో అన్నదానం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రాజా వీధిలోని శ్రీకల్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేషాలంకరణ ఏర్పాటు చేశారు. ఆలయ ఛైర్మన్ తుమ్మూరు మునిమోహన్ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి వారం క్రమం తప్పకుండా అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు.

మహిళలకు చీరల పంపిణీ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: రంజాన్ సందర్భంగా షేక్ రియాజ్ అహ్మద్ మంగళవారం 100 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తమ్ముళ్లు ఇలియాజ్ అహ్మద్, హఫీజ్ అహ్మద్‌లతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్ ఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మగ్దూమ్, లయన్ షేక్ రియాజ్ అహ్మద్, ఇలియాజ్ అహ్మద్, హఫీజ్ అహ్మద్, హుస్సేన్, షానవాజ్, మగ్దూమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెట్టాలన్న ఒక చంద్రబాబు నాయుడుకే సాధ్య మని.. రానున్న 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని కోరారు. మంగళవారం 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని' కార్యక్రమాన్ని రణధీరపురం గ్రామ పంచాయతీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళు తూ రానున్న ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో బలపరచి, అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండల టిడిపి అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, మండల నాయకులు, తిరుమలనగర్, మంగళం, సప్తగిరి కాలనీ, రణధీరపురం గ్రామపంచాయతీలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ పనులు వేగవంతం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కింద తిరుపతి నగరంలో జరుగుతున్న అబివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ హరిత అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కింద నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంగళవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే పూర్తి అయిన ప్రాజెక్టుల నిర్వహణ చక్కగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అలాగే పనులు జరుగుతున్న ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి నాణ్యతతో పూర్తి అయ్యేలా చూడాలన్నారు. నగరంలో ముఖ్యమైన ప్రాజెక్టులు అయిన శ్రీనివాస సేతు, వినాయకసాగర్ , భూగర్భ విద్యుత్ కేబుల్ వంటి ప్రాజెక్టులపై అధికారులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు ఈ సమావేశంలో జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఈ ఈ చంద్రశేఖర్, డి.ఈ. మోహన్, ఏ.ఓ. రాజశేఖర్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, స్మార్ట్ సిటీ సిబ్బంది ఉన్నారు.

'ఆరోగ్యశ్రీ' లో ఫిర్యాదులొస్తే చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన సేవలను అందిస్తున్నామని, ఏమైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర వెంకటరమణారెడ్డి చెప్పారు. ఆరోగ్యశ్రీ జిల్లా డిసిప్లినరీ కమిటీ మొట్టమొదటి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన ఎక్స్‌అఫిషియో అడిషనల్ సీఈవో ఆరోగ్యశ్రీ హోదాలో ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్లతో మంగళవారం సమావేశమయ్యారు. ఆరోగ్యశ్రీలో గుర్తించబడిన వ్యాధులకు నగదు రహిత ఆరోగ్యశ్రీ సేవలు పేదవారికి, ఉద్యోగులకు అందించాలని, చికిత్స సమయంలో నాణ్యమైన ఆహారం, చికిత్స అనంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులూ ఉండరాదన్నారు. రుయా హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ కింద పని చేయడానికి డేటా ఎంట్రీ ఆపరేటర్లను సరిపడా నిబంధనల మేరకు నియామకానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆరోగ్య మిత్రలు రోగులకు అందుబాటులో లేని పక్షంలో వారిపై చర్యలు ఉంటాయని, చికిత్స పొందిన రోగుల నుండి డబ్బులు వసూలు చేయడం లాంటి పనులు చేయరాదని అన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల నుండి ఆరోగ్యశ్రీ పేషెంట్ కు సంబంధించిన డిశ్చార్జ్ సమ్మరీ, ఆసరా లెటర్, కన్ఫర్మేటివ్ లెటర్, కన్సెంట్ లెటర్ తదితర పత్రాలను సకాలంలో అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్ రెడ్డి, డిఎంహెచ్ఓ శ్రీహరి డిసిహెచ్ఎస్ ప్రభావతి, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శివ కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి రుయా సూపరింటెండెంట్ నాగ మునీంద్రుడు, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్, బర్డ్స్ స్పెషల్ ఆఫీసర్ రెడ్డప్ప, పద్మావతి హార్ట్ అండ్ చిల్డ్రన్ స్పెషాలిటీ డైరెక్టర్ శ్రీనాథ్ ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరులో.. దర్జాగా కబ్జా..!




- పుణ్యక్షేత్రంలో విచ్చలవిడిగా ఆక్రమణలు
- కనిపించని కాలువలు, బస్సు షెల్టర్
- రోడ్లపైనే అస్తవ్యస్తంగా దుకాణాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి-తిరుచానూరు: శ్రీవారి దేవేరి శ్రీపద్మావతి అమ్మవారు కొలువైన తిరుచానూరులో దర్జాగా కబ్జాల పర్వం కొనసాగుతతోంది. ఆక్రమణల జోరుతో భక్తుల అవస్థలతోపాటు రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యతోపాటు రోడ్లు సైతం కుచించుకుపోతున్నాయి. మురుగునీటి కాలువలను సైతం ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటూ కొందరు పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఏకంగా స్థావరాలు ఏర్పాటు చేసుకుని అద్దెలకు ఇచ్చే స్థాయిలో ఉంటూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్న తిరుచానూరులో విచ్చలవిడిగా రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తూ కొందరైతే అధిక ధరలకు విక్రయాలు చేపడుతూ భక్తులను నిలువ దోపిడీ చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న బస్సుషెల్టర్ పరిసర ప్రాంతాలలో అధికంగా బంకులు, పందిళ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తుండటంతో కనీసం భక్తులు నిలుచుకునేందుకు నీడ లేదు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయం చేరుకునేందుకు అడుగడుగునా రోడ్డు ఆక్రమించుకున్న తోపుడు బండ్ల వ్యాపారులతో భక్తులు సతమతమవుతున్నారు. అయితే టీటీడీ అధికారులు, పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యహరించడంతో నోరుమెదపక భక్తులు నిరాశకు గురువుతున్నారు. ఆక్రమణలన్నీ పంచాయతీ పరిధిలోకి వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కాలువలపైనే అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఆక్రమణదారులకు అధికార పార్టీ అండదండలు ఉండటంతో ప్రశ్నించేందుకు స్థానికులు ధైర్యం చేయలేకపోతున్నారు. తితిదే, పంచాయతీ అధికారులు సంయుక్తంగా ఆక్రమణలు నిలువరించాలి. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

తిరుచానూరులో ఆక్రమణలు తొలగించాలి




తిరుచానూరులో ఆక్రమణలు అధికంగా ఉన్నాయి. కాలు వలు, బస్సుషెల్టర్ సైతం ఆక్రమణలకు గురికావడంతో భక్తులు ఇబ్బందులు పడు తున్నారు. కాలువలు ఆక్ర మించి నిర్మాణాలు చేపడు తున్నా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోక పోవడం దారుణం. రోడ్లను పూర్తిగా ఆక్రమించే స్తున్నారు. ఇకనైనా టీటీడీ, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. **- సుమన్, ఎంపీటీసీ, తిరుచానూరు**





లాబీయిస్టు విజయ్‌కుమార్‌పై టీటీడీ వివరణ ఇవ్వాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుమల ఆలయంలో వివిఐపీల పక్కన రెగ్యులర్ గా కనపడే లాబీయిస్టు విజయ్‌కుమార్ ఎవరి సిఫార్సు కారణంగా తిరుమల ఆలయంలోకి వస్తున్నారు? ఏ ప్రోటోకాల్ ప్రకారం రంగనాయక మండపంలో కనిపిస్తున్నారు? తదితర అంశాలపై టీటీడీ యాజమాన్యం వివరణ ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సామాన్యులకు అందని ద్రాక్షలా ఉన్న స్వామివారి దర్శనం లాబీయిస్టుల చేతులలో ఎందుకుందని సూటిగా ప్రశ్నించారు. పవర్ బ్రోకర్ లకు, లాబీయిస్టులకు తిరుమల ఆలయంలో ఎందుకు ప్రాధాన్యత లభిస్తుందో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిలు స్వామివారి భక్తులకు సమాధానం చెప్పాలన్నారు. తిరుమలకు ఉన్న ప్రాసస్త్యాన్ని, ప్రతిష్టను మంటగలిపే చర్యలను విడనాడాలని విజ్ఞప్తి చేశారు. సమాజ వ్యతిరేకులను నియంత్రించడం ప్రభుత్వానికి, టీటీడీ యాజమాన్యానికి, పాలకమండలికి విధిగా బాధ్యత ఉండాలని ఆయన కోరారు. ఇటీవల విఐపిలకు టీటీడీలో ప్రాధాన్యత విపరీతంగా పెరిగిందని, సామాన్యుడు సాధారణ దర్శనాలకు గంటల తరబడి, రోజుల తరబడి వేచి ఉంటే, పవర్ బ్రోకర్ లు ఆలయంలో తిష్ట వేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. టిటిడి పై పలు రకాల విమర్శలు ఎదురవుతున్నా పాలక పార్టీలు కార్పొరేట్ కంపెనీలకు, లాబీయిస్టులకు టీటీడీని ఆయుధంగా మార్చటం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఇకనైనా ఇలాంటి వారిని నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి ఎస్వియూ శ్రీనివాస ఆడిటోరియంలో ఎమ్ఎస్పి, ఎమ్ ఆర్ పిఎస్, అనుబంధ విభాగాల జాతీయ సదస్సు నరేంద్ర బాబు మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్ఎస్పి, ఎమ్ ఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ మాట్లాడుతూ దేశంలో ఏ సామాజిక వర్గం చేయని విధంగా మాదిగలు ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 30 ఏళ్లుగా రాజీలేని పోరాటం కొనసాగిస్తున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైనది, ధర్మమైనదని అన్నారు. న్యాయం,ధర్మం గెలువడమే సత్యమైతే ఎస్సీ వర్గీకరణ పోరాటం అంతిమంగా గెలిచి తీరుతుందన్నారు. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ న్యాయం వైపు, ధర్మం వైపు నిలబడకపోవడంతో వర్గీకరణ ఆలస్యం అవుతుందన్నారు. 30 ఏళ్ల మాదిగల పోరాటానికి,75 ఏళ్ల ఆకాంక్షకి న్యాయమైన ముగింపు ఇవ్వాల్సిన బాధ్యత బీజేపీ మీదనే ఉందని తెలిపారు. అందుకోసం వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డా. వై విశ్వనాథ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేశ్ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, జాతీయ అధ్యక్షుడు డా. చిలుముర్రి శ్రీనివాస్ రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ బిక్షాలు మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్ర ప్రసాద్ మాదిగ, జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్, ఇరు రాష్ట్రాల అధ్యక్షుడు బెనర్జీ, కార్తీక్,కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు నర్సప్ప మాదిగ, మహారాష్ట్ర అధ్యక్షుడు అజిత్ మాదిగ, తమిళనాడు అధ్యక్షుడు లోకేష్ మాదిగ, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు బొర్ర భిక్షపతి మాదిగ, పేరెల్లి ఎలీషా మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే అందరికీ సమన్యాయం





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: జగనన్న ప్రభుత్వంలోనే అందరికీ సమన్యాయం జరుగుతోందని.. కులమతాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ అన్నారు. మంగళవారం మండలంలోని సుబ్బనాయుడుకండ్రిగ, కె.వెంకటాపురం పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచాయతీలోని ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్, ఈవోపీఆర్డీ సురేంద్రనాథ్, ఏఈ అలీ, డీడీవో భానుప్రియ, సర్పంచ్ రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేవీబీపురం: రాగిగుంట సచివాలయ పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మునిలక్ష్మీ నందకుమార్, రాష్ట్ర హిస్టరీ అకడమిక్ డైరెక్టర్ గవర్ల క్రిష్ణయ్య, జడ్పిటిసి మూర్తి, మునెమ్మ, సుబ్బయ్య, వైస్ ఎంపీపీ దేరాల శ్రీనివాసులు, సరస్వతి, రమేష్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనంజయులరెడ్డి, తహశీల్దార్ ద్వారకనాథరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, ఎంఈవో లక్ష్మీపతి, ఎస్ఐ సునీల్, ఏఎస్ఐ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



గూడూరు టౌన్: పేదల పక్షపాతి వై.ఎస్ .జగన్మోహన్‌రెడ్డి అని వైసీపీ కన్వీనర్ దాసరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం గూడూరు పట్టణం బనిగి సాహెబ్ పేటలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ బాబు, ధనమ్మ, గహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏపీఆర్జేసీల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 2023-24వ సంవత్సరానికి గానూ ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, వచ్చేనెల 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లతో పాటు వత్తి విద్యా కోర్సులైన ఈఈటి, సీజీటీ గ్రూపుల్లో సీటు పొందవచ్చన్నారు. ఏ.పీ.ఆర్.జే.సి. కళాశాలలో విలువలతో కూడిన ప్రామాణిక విద్యను అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బోధన, ఉచిత వసతి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9399976999 / 8688888802 ఫోన్ నంబర్లను సంప్రదించి సందేహాలను నివత్తి చేసుకోవచ్చని తెలిపారు.

మూగజీవాల పరిరక్షణకు నీటి పాత్రల పంపిణీ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా మూగజీవాలను పరిరక్షించుకోవాలని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం తిరుపతి-కరకంబాడీ మార్గంలోని ఎస్వీసీఈలో కళాశాల జాతీయ సేవా పథకం, సేవా నేచురియల్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు నీటి పాత్రలను అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న తరుణంలో మూగజీవాలైన పక్షులకు ఈ నీటి పాత్రలలో నీటిని ఉంచి వాటి ప్రాణ రక్షణకు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో సేవ నేచురియల్ సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్, జాతీయ సేవా పథకం అధికారులు చంద్రయ్య, సుజన్ కుమార్, అంజన్ కుమార్ రెడ్డి, నరేన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కేంద్రమంత్రి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేంద్ర కమ్యూనికేషన్ శాఖామంత్రి దేవు సిన్హు చౌహాన్ మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి స్థానిక బిజెపి నాయకులు సాంప్రదాయ స్వాగతం పలికే దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ వేద పండితులు ఆశీర్వచనాలు పలికగా, ఆలయ పాలకమండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, బిజెపి నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వచ్చేనెల 13న జరగబోవు జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయాలని పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర మంగళ వారం తెలిపారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడంతో సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని.. అప్పీల్ ఉండదని తెలిపారు. అవకాశాన్ని స ద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు సహకరించాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా

పదిమందికి తీవ్ర గాయాలు



ప్రజాశక్తి-చంద్రగిరి: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో ఆర్టీసీ బస్సు బోల్తా పడటంతో బస్సులోని పది మందికి తీవ్రగాయాలైన ఘటన చంద్రగిరి మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిలోని ఎం.కొంగరవారిపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ మణితో పాటు పదిమంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. చిత్తూరు ఒకటో డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతి నుండి 35 మంది ప్రయాణికులతో పలమనేరుకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. బస్సు అదుపుతప్పి సర్వీస్ రోడ్డు దాటి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మామిడి తోటలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. గాయపడిన వారిని 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రజాశక్తి-బాలాయపల్లి: వెంకటగిరి-గూడూరు రోడ్డు మార్గంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ వద్ద ఉన్న నేరేడు కాలువలో మోటర్ సైకిల్ అదుపుతప్పి పడి ఓ యువకుడు అక్కడికక్కడే మతిచెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాలాయపల్లి ఎస్ఐ వీరనారాయణ కథనం మేరకు.. సోమవారం గూడూరు పట్టణంలోని ఫొటో స్టూడియో నిర్వహిస్తున్న గోపి మండలంలోని రామాపురం గ్రామంలో ఓ ఫంక్షన్ కు వెళ్లి తిరిగి వెళుతూ అర్ధరాత్రి నేరేడు కాలువ బ్రిడ్జి పైకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్లాడి డ్రగ్స్‌లో భారీ అగ్నిప్రమాదం



ప్రజాశక్తి-రేణిగుంట: గాజులమండ్యం పారిశ్రామికవాడలోని మల్లాడి డ్రగ్స్ కర్మాగారంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. కర్మాగారంలో ఉదయం ఆయిల్ డ్రమ్ముల వద్ద అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో విధుల్లో ఉన్న నక్కల సాయికిషోర్ (27) స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ధర్మారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వైసీపీ పభుత్వం పేదలపై పెనుభారం మోపుతోందని..రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్ అన్నారు. మంగళవారం పుత్తూరు మున్సిపాలిటీని 16వ వార్డులో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నియోజకవర్గం ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను తెలియజేస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆనంగి ఆనంద్, లక్ష్మణచారి, భాస్కర్, రమేష్, హరి, గిరి, భాస్కర్‌నాయుడు, రవినాయుడు, మణి, బాబు, గుర్రప్ప, వెంకటేష్, దాము, రాజేష్, కవిత, దివిజ, లక్ష్మీదేవి, నదియా, మల్లమ్మ, జయంతి, సుబ్బమ్మ, గీత, అనురాధ, రజిని, టీజీ రాజేంద్ర, చీరల మోహన్, ఈశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



దొరవారిసత్రం: కట్టువపల్లి తొగరాముడి గ్రామంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు గోని శంకరయ్య, మండల బీసీసెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు యాదవ్, బిసి సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఒలిపి వెంకటయ్య, మాజీ సర్పంచ్ కష్ణమూర్తి, మణి, నాయకులుఉదయ్ కుమార్, కిషోర్, రమణయ్య యాదవ్, ప్రసాద్ నాయుడు, నాగయ్యనాయుడు పురుషోత్తం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాల్లో మాంసం దుకాణాలు తొలగించాలి



ప్రజాశక్తి-తిరుచానూరు: శ్రీ పద్మావతీ అమ్మవారు కొలువైన ఆలయ పరిసరాల్లో మాంస విక్రయాలు లేకుండా చూడాలని సినీ నటి, మా జాయింట్ సెక్రటరీ, శ్రీఆదిభట్ల శ్రీకళా పీఠం జాతీయ అధ్యక్షురాలు పడాల కల్యాణి మంగళవారం పంచాయతీ సెక్రటరీకి వినతి పత్రం అందించారు. కోర్టు ఉత్తర్వులు, నిబంధల ప్రకారం త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హిందూ జనశక్తి సంఘం లలిత్ కుమార్, హిందూ సంఘాల ఐక్య వేదిక రవీందర్‌రెడ్డి, వేణుగోపాల్, నరసింహ, మధుకర్, సాయి, విజయ్ కుమార్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.